క్లుప్తంగా

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

8న వేంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం

ఆమనగల్లు: పట్టణంలోని వేంకటగిరి వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 6న విశ్వక్సేన ఆరాధాన, 7న మహాభిషేకం, 8న స్వామివారి కల్యాణోత్సవం, 9న రథోత్సవం, 10న సుదర్శన హోమం, చక్రతీర్థం, పూర్ణాహుతి నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ ధర్మకర్త గూడ కృష్ణమాచార్యులు తెలిపారు.

బాల్య మిత్రుడికి చేయూత



మల్లేశ్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న బాల్యమిత్రులు

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన ముత్తి మల్లేశ్ తండ్రి తులసీదాస్ అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మల్లేశ్ బాల్య మిత్రులు బుధవారం ఉదయం మల్లేశ్‌ను పరామర్శించారు. స్నేహితులంతా కలిసి రూ.37 వేలు ఆర్థికసాయం అందజేసి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో రాఘవేందర్, పాండునాయక్, వీరేంద్ర, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీను తదితరులు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



ఎంఈఓకు నగదు అందజేస్తున్న ఉపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది, సీఆర్పీలు

మాడ్గుల: మెదక్ జిల్లా చేగుంట మండలంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీఆర్పీలు రమేశ్, శ్రీనివాస్ కుటుంబాలకు అండగా మండల పరిధిలోని ఉపాధ్యాయులు, సీఆర్పీలు నిలిచారు. వారు కుటుంబానికి ఆర్థిక సాయం అందించేందుకు రూ.30వేలు సేకరించారు. ఈ సేకరించిన మొత్తాన్ని ఎంఈఓ సర్దార్‌నాయక్‌కు అప్పగించి మృతుల కుటుంబాలకు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఆర్‌సీ సిబ్బంది, సీఆర్పీలు మధు, యాదగిరి, జలంధర్, తిరుపతి, లక్ష్మయ్య, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

కులసంఘాల స్థలాన్ని వదిలేయాలి

బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు లక్ష్మయ్య

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని జెన్నాయిగూడ గ్రామంలో గత ప్రభుత్వం కుల సంఘాలకు ఇచ్చిన స్థలాన్ని వదిలేయాలని మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య యాదవ్ కోరారు. బుధవారం రావిర్యాల గ్రామంలో ఆ యన మాట్లా డారు. రావిర్యాల గ్రామంలోని రెడ్డి, పద్మశాలి, నాయీబ్రహ్మణ, యాదవ, గంగ పుత్రులు తదితర కులాలకు ఒకే ప్రదేశంలో భవనాల నిర్మాణాలకు జెన్నాయిగూడ గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని ఇచ్చారన్నారు.ఈ స్థలం అన్ని కులాలవారు సుమారు రూ.20లక్షల వరకు సొంత డబ్బులు ఖర్చుపెట్టి భూమిని చదును చేశారన్నారు. గతంలో మంత్రిగా పని చేసిన ప్రస్తుతం మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి ఆ భూమిలో భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేసిందని విషయం ఆయన గుర్తుచేశారు. ఇప్పుడు ఆ భూమిలో లెన్స్‌కార్ట్ పరిశ్రమను ఏర్పాటు చేశారన్నారు. తాము అభివృద్ధిని అడ్డుకోము కానీ, కులసంఘాల స్థలాన్ని వదిలివేయాలని కోరారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



బిల్‌స్టాప్ సర్వీసులను తనిఖీ చేస్తున్న సూపరింటెండెంట్ ఇంజినీర్ సి.మాధవరెడ్డి

హుడాకాంప్లెక్స్: యజమానులు పెండింగ్‌లో ఉన్న బకాయిలను మొత్తం చెల్లించి తమ సర్వీసులను పునరుద్ధరించుకోవాలని సూపరింటెండెంట్ ఇంజినీర్ సి.మాధవరెడ్డి కోరారు. పెండింగ్ విద్యుత్ బకాయిలు వసూళ్లలో భాగంగా బుధవారం సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని కొత్తపేట సెక్షన్‌లో బిల్‌స్టాప్ సర్వీసులను ఆయన తనిఖీ చేసి అట్టి సర్వీసు బేసిక్ బిల్లు రూ.75వేలను వినియోగదారుడి చేత కట్టించారు. విద్యుత్ బిల్లులు పెండింగ్ ఉన్నా, వినియోగదారులు తొలగించినా, తమకు సర్వీసులను బకాయిలు చెల్లించకుండా స్వయంగా పునరుద్ధరించుకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ పి.అంజయ్య, డివిజనల్ ఇంజినీర్ రామకృష్ణ, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ఆర్.రమణారెడ్డి ఉన్నారు.

కూరగాయాల మార్కెట్లు

రూ.లక్షలు వెచ్చించి నిర్మాణం

- పదేళ్లుగా నిరుపయోగం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన మార్కెట్ ప్రాంగణం
- పట్టించుకోని పాలకులు



నిరుపయోగంగా మాల్ మార్కెట్ దుకాణ భవన సముదాయం

యాచారం: రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన కూరగాయల మార్కెట్లు నిరుపయోగంగా మారాయి. ఈ భవనాలను వాడుకలోకి తీసుకురావాల్సిన పాలకులు పట్టించుకోవడం లేదు. దీంతో ఈ భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారుతోంది. 2013లో రంగారెడ్డి–నల్లగొండ జిల్లాల సరిహద్దు మాల్ వ్యాపార కేంద్రంలో రూ.21లక్షలు వెచ్చించి 15 దుకాణాలు నిర్మించారు. ఈ దుకణాలు ప్రారంభించిన సమయంలో వ్యాపారులు కొన్నాళ్లపాటు యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, మాడ్గుల, కడ్తాల్, ఆమనగల్లు తదితర మండలాల నుంచి రైతులు కూరగాయాలను తెచ్చి విక్రయించే వారు.

నందివనపర్తిలో అసంపూర్తి నిర్మాణం

ఈ మాల్ మార్కెట్ పదేళ్లగా నిరుపయోగంగా మారింది. ఇక్కడి వ్యాపారులు నల్లగొండ జిల్లా పరిధిలోని శ్రీవేంకటేశ్వర కాలనీలోని మార్కెట్ కమిటీ పరిధిలోని వెళ్లారు. ఆ తదనంతరం జిల్లా పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో వ్యాపారులు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు. మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకునే వారే కరువయ్యారు. నందివనపర్తి గ్రామంలోనూ రూ.10లక్షలు వెచ్చించి మార్కెట్ కోసం దుకాణాలు నిర్మించారు. ఈ దుకాణాలు అసంపూర్తిగా ఉండడంతో నిత్యం ఉదయం, సాయంత్రం చిరు వ్యాపారులు రోడ్డుపైనే కూరగాయలు విక్రయిస్తున్నారు. మేజర్ గ్రామ పంచాయతీలైన మాల్, నందివనపర్తి, గునుగల్, నక్కర్తమేడిపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో పల్లె కూరగాయల మార్కెట్లను ఏర్పాటు చేస్తే పంచాయతీలకు మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని ప్రజలు అంటున్నారు.



నందివనపర్తిలో అసంపూర్తిగా ఉన్న కూరగాయల మార్కెట్

గతంలో విక్రయించేది



వ్యవసాయ భూముల్లో పండించిన కూరగాయలను మాల్ మార్కెట్‌కు తరలించి విక్రయించేవాళ్లం. మార్కెట్‌లో విక్రయించగా వచ్చిన డబ్బుతో ఇంటికి సరుకులు, వ్యవసాయ పనులకు కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేసి తెచ్చుకునేది. ఇప్పుడు మార్కెట్ వినియోగం లేక అటువైపు వెళ్లడమే లేదు.

–మర్పల్లి బాల్‌రాజ్ యాదవ్, రైతు మొండిగౌరెల్లి

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



మాల్‌లో కూరగాయల మార్కెట్ ఉపయోగంలోకి తెచ్చేలా, పశువుల సంతకు ఐదెకరాల స్థలం కేటాయించేలా కృషి చేయాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కోరాం. ఇందుకు ఆయన సానుకులంగా స్పందించారు. తాను సర్పంచ్‌గా ఉన్న రోజుల్లోనూ పలు మార్లు పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. దృష్టికి తీసుకెళ్లిన వారు స్పందించలేదు.

– పదకంటి కవిత, మాజీ సర్పంచ్, మాల్

వ్యాపారులతో సమావేశం



మాల్‌లోని నిరుపయోగంగా ఉన్న కూరగాయల మార్కెట్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తాం. ఉన్నతాధికారులతో మాట్లాడి వ్యాపారులతో సమావేశమవుతాం. వ్యాపారులు ఆసక్తి చూపకపోతే టెండర్లు వేసి వ్యాపారం చేసుకునే వారికి అప్పగిస్తాం. నందివనపర్తిలో అసంపూర్తిగా ఉన్న భవనాలను త్వరితగతిన పూర్తి చేస్తాం.

– శ్రీలత, మండల పంచాయతీ అధికారి

ప్రజారోగ్యంపై శ్రద్ధ అవసరం

ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. బుధశారం మండల పరిధిలోని ఎల్మినేడులో జె.వెంకటరామయ్య విద్యావైద్య సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ కేపీవీ రాజు మాట్లాడుతూ.. ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉంటూ శుచిగా ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతీ రోజు వాకింగ్, వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ప్రతీ ఆరునెలలకు ఒక సారి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మంచిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శేఖర్‌రెడ్డి, మంచిరెడ్డి రాజేందర్ రెడ్డి, డాక్టర్ జాన్సన్, డాక్టర్ మంజులవాణి, హెచ్‌ఎం సుధాకర్, నిర్వాహకులు జేవీ రాములు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు

ఆన్‌లైన్ గేమ్‌లకు దూరంగా ఉండాలి

మంచాల: యువత ఆన్‌లైన్ గేమ్‌లకు దూరంగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేవీపీ రాజు సూచించారు. బుధవారం మండల పరిధిలోని నోముల గ్రామంలో యువతకు ఆన్‌లైన్ గేమ్, రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు వినతి

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. నూతనంగా ఏర్పాటైన కాలనీల్లో కనీస వసతుల ఏర్పాటుకు నిధులను మంజూరు చేయాలని బుధవారం ఆమె మేయర్ గద్వాల విజయలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమన్నారు. డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానన్నారు.

సమస్యల పరిష్కరించాలని ఎంపీకి..

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధిలో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు బుధవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వనస్థలిపురం రైతుబజారు ముందు ఉన్న రోడ్డును విస్తరించి ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించాలని, శిథిలమైపోయిన హెచ్‌ఎండీఏ ఓపెన్ ఆడిటోరియంను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. వినత ఇచ్చిన వారిలో జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, నీళ్ల అంజన్‌కుమార్‌గౌడ్, కాటం క్రాంతిగౌడ్, బండి రమేష్, అనిల్‌కుమార్ ఉన్నారు.

ప్రగతిని గుర్తించేందుకు టాలెంట్ టెస్ట్‌లు



ఎస్‌ఎస్‌సీ టాలెంట్ టెస్టు విజేతలకు బహుమతులు అందజేస్తునన శ్రీదేవి, లక్ష్మీనివాస్

ఆమనగల్లు: విద్యార్థుల ప్రగతిని గుర్తించేందుకు టాలెంట్ టెస్టులు దోహదపడుతాయని సీనియర్ జర్నలిస్ట్ శ్రీదేవి టీఎస్‌ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ అన్నారు. టీఎస్‌ఎస్‌ఓ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్‌ఎస్‌సీ టాలెంట్ టెస్ట్ విజేతలతకు బుధవారం బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి లిటిల్ స్కాలర్స్ టెక్నోస్కూల్ విద్యార్థిని క్రిస్టినా సారోస్, ద్వితీయ బహుమతి వివేక విద్యాభారతి పాఠశాల విద్యార్థిని శ్రీవైష్ణవి, తృతీయ బహుమతిని బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్ విద్యార్థిని లహరి గెలుచుకున్నారు. పట్టణంలోని మానసా గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విజేతలకు సీనియర్ జర్నలిస్ట్ శ్రీదేవి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, ఎంఈఓ పాండు, టీఎస్‌ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్, విద్యార్థి జేఏసీ చైర్మన్ రాజు, సెన్సార్‌బోర్డు సభ్యులు చంద్రశేఖర్, నాయకులు ప్రభుశంకర్, శివలింగం, అల్లాజీగౌడ్, మహమూద్, ఏవీశర్మ, శ్రీశైలం, చిక్కి, శివ, సాయి, ధనుష్, శివరాజ్, టీఎస్‌ఎస్‌ఓ రాష్ట్ర కోఆర్డినేటర్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా సహచర విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, ఎంఈఓ పాండు, మాజీ కౌన్సిలర్ విజయ్‌కృష్ణ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ జ్యోతి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఉపాధ్యాయులు చందర్, సరస్వతి, చెన్నకేశవరెడ్డి, వెంకట్‌నారాయణ, భాస్కర్, జగన్మోహన్, ఆర్‌కె శర్మ, స్వప్న పాల్గొన్నారు.

రాచ కాలువ పరిశీలన



కాలువను పరిశీలిస్తున్న అధికారులు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివజన్ పరిధిలోని మహాలక్ష్మీనగర్, జక్కిడి రామస్వామి కాలనీ, సౌభాగ్యనగర్ తూర్పు విభాగం నుంచి బృందవన్ మిడోస్ వరకు చేపట్టనున్న పైప్‌లైన్ కోసం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. రెండు కిలోమీటర్ల మేర క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అధికారులకు స్థానిక బీఆర్‌ఎస్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి వివరాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈఈ శుక్లజా, ఏఈ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవానికి హాజరైన భక్తజనం

వైభవం..రథోత్సవం



ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే రంగారెడ్డి, గడ్డిఅన్నారం ఏఎంసీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధి తారామతిపేట్‌లో మహంకాళి మాత ఆలయ వార్షికోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. వేలాది భక్తుల నడుమ శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం రథోత్సవంలో శివపార్వతుల ఉత్సవ మూర్తుల ఊరేగింపు అంగరంగవైభంగా కొనసాగింది. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, గడ్డిఅన్నారం ఏఎంసీ చిలుక మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

– హయత్‌నగర్

పాఠశాల స్థాయి నుంచే నైపుణ్యం

ఎంఈఓ పాండురంగారెడ్డి

యాచారం: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే అన్ని అంశాలపై నైపుణ్యం పెంచుకోవాలని మండల విద్యాధికారి పాండురంగారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని నందివనపర్తి జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించారు. ఏఐ టెక్నాలజీ, సెల్ఫీ పాయింట్, బిందు సేద్యం, సమీకృత వ్యవసాయం, భూ కంపాలను తెలియజేసే అలారం, చంద్రయాన్, సోలార్ ఎనర్జీ, భూఅంతర్ నిర్మాణం తదితర ఎగ్జిబిట్స్ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఏవీఆర్ శాస్త్రి, ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, కిషన్, వెంకటేశ్, శ్రీనివాస్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్న పాఠశాల విద్యార్థులు

పెండింగ్ వేతనాలు చెల్లించండి



డీపీఓ సురేష్‌మోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

జీపీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పాండు

ఇబ్రహీంపట్నం రూరల్: గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన సీఐటీయూ నాయకుడు పోచమోని కృష్ణతో కలిసి డీపీఓ సురేశ్‌మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాండు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ప్రతీ నెల కార్మికులకు వేతనాలు చెల్లించాలని కోరారు. 2025 జనవరి నుంచి నేరుగా కార్మికుల ఖాతాలో వేతనాలు జమ చేస్తామని ప్రకటించి నేటికి చెల్లించకపోవడం సిగ్గు చేటన్నారు. ఎస్టీఓలలో నిలిచిపోయిన బకాయి వేతనాలు విడుదల చేయాలన్నారు. పంచాయతీల బ్యాంకు ఖాతాల ఫ్రీజింగ్‌ను ఎత్తివేసి కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

మంత్రి పర్యటనను విజయవంతం చేయండి

- మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: రాష్ట్ర ఐటీ శాఖ, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గురువారం తుక్కుగూడ మున్సిపాలిటీలో పర్యటిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లార్ తెలిపారు. బుధవారం జెన్నాయిగూడ గ్రామంలో లెన్స్‌కార్ట్ పరిశ్రమను ఏర్పాటు చేసే స్థలాన్ని, డీసీపీ భవనం నిర్మించే స్థలాన్ని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబుతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జెన్నాయిగూడ గ్రామంలో ప్రపంచస్థాయి హంగులతో ఏర్పాటు చేసే పరిశ్రమ లెన్స్‌కార్ట్ అన్నారు. ఫోర్త్‌సిటీలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా డీసీపీ కార్యాలయాన్ని నిర్మిస్తున్నామన్నారు. వీటి పనుల శంకుస్థాపనతో పాటు మరికొన్ని అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేస్తారన్నారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, ఏనుగ జంగారెడ్డి, నర్సింహ్మా, కష్టానాయక్, ఈశ్వర్, పాండురంగారెడ్డి, రాజ్‌కుమార్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు షురూ..



యాచారం: జీజేసీలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

- తొలిరోజు పరీక్షలు ప్రశాంతం
- ఎగ్జామ్ సెంటర్ల వద్ద 144 సెక్షన్

ఆమనగల్లు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు మొదటి సంవత్సరంలో తెలుగు, సంస్కృతం పరీక్షలు ప్రారంభమయ్యాయి. 257 మందికి గాను 246 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఆమనగల్లులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ పరీక్ష కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రమీళమ్మ జూనియర్ కళాశాల, కడ్తాలలోని బ్రిలియంట్, ఎస్‌వీఎస్ జూనియర్ కళాశాలల విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను పరీక్షల సూపరింటెండెంట్ మాధవరావ్, డిపార్ట్‌మెంట్ అధికారి అనంతరెడ్డి పరిశీలించారు.

క్షుణ్ణంగా తనిఖీలు

మాడ్గుల: ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు పరీక్షలు 96 మంది విద్యార్థులు హాజరవ్వగా ఇద్దరు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్ వద్ద క్షుణ్ణంగా తనిఖీలు చేసి విద్యార్థులను లోనకు అనుమతించారు.

సెంటర్ వద్ద 144 సెక్షన్

యాచారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రారంభమైన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 283 మంది విద్యార్థులకు గాను మొదటి రోజు ఐదుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని యాచారం సీఐ నందీశ్వర్ రెడ్డి సందర్శించి బందోబస్తును పర్యవేక్షించారు.



ఆమనగల్లు: పరీక్షా కేంద్రం వద్ద హాల్ టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

17 మంది విద్యార్థులు గైర్హాజరు

మంచాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. 313మంది విద్యార్థులకు గాను 296 మంది హాజరయ్యారు. 17మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

13 కేంద్రాల్లో పరీక్షలు

ఇబ్రహీంపట్నం రూరల్: ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఇబ్రహీంపట్నం మండలంతో పాటు ఆదిబట్ల మున్సిపల్ పరిధిలో 13 సెంటర్లను ఏర్పాటు చేశారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు నిర్వహించిన పరీక్షకు తొలిరోజు 6,586 గాను 6,535 మంది విద్యార్థులు పరీక్షలు హాజరవ్వగా 51 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.



ఇబ్రహీంపట్నం రూరల్: హాల్‌టికెట్ నంబర్లు చెక్ చేసుకుంటున్న విద్యార్థులు



మంచాల: జీజేసీ నుంచి పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు